

గేట్‌లో సునీల్‌కుమార్ ప్రతిభ



ప్రజాశక్తి-డుంబ్రిగుడ: ఆల్ ఇండియా గేట్ ఫలితాల్లో మండల కేంద్రంలోని గిరి యువకుడు ప్రతిభను చాటారు. మండల కేంద్రం డుంబ్రిగుడ గ్రామానికి చెందిన శెట్టి సునీల్ కుమార్ గేట్ ఫలితాల్లో 738 ర్యాంకును సాధించి ప్రతిభను కనబరిచారు. ఉద్యోగం చేస్తునే మరోపక్క పరీక్షకు సన్నద్ధం అయ్యి ఉత్తమ ప్రతిభను కనబరిచారు. ఆయన తండ్రి వెలుగు శాఖలో ఏపీఎంగా పని చేస్తున్నారు. డీఆర్డీవోలో శాస్త్రవేత్తగా కావాలన్నదే లక్ష్యంగా పెట్టుకోవడం జరిగిందని ఆయన తెలిపారు.

పెరిగిన ధరలకు అనుగుణంగా

ఇళ్ల నిర్మాణాలకు రూ.10 లక్షలు చెల్లించాలి

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కిల్లో సురేంద్ర - పలుచోట్ల ప్రజా చైతన్య యాత్రలు



వినతిపత్రాన్ని ఇస్తున్న కిల్లో సురేంద్ర, నాయకులు, గిరిజనులు

ప్రజాశక్తి-పెదబయలు: పీఎం జన్మన్ ఇళ్ల నిర్మాణానికి పది లక్షల రూపాయలు పెంచాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కిల్లో సురేంద్ర డిమాండ్ చేశారు. మండలంలోని అడుగుల పుట్టు, లక్ష్మీపేట, గ్రామ సచివాలయం పరిధిలో సిపిఎం ప్రజా చైతన్య యాత్రలో భాగంగా వివిధ గ్రామాల్లో పర్యటించారు. ప్రజా సమస్యలు వెంటనే పరిష్కారం చేయాలని శుక్రవారం అడుగుల పుట్టు సచివాలయం కేంద్రం వద్ద ఆదివాసి లతో నిరసన చేపట్టారు.వినతి పత్రాన్ని స్థానిక పంచాయతీ కార్యదర్శికి అందించారు. ఈ సందర్భంగా కిల్లో సురేంద్ర, పార్టీ మండల కార్యదర్శి బొండా సన్నిబాబు మాట్లాడుతూ,పివిటిజి కుటుంబాలకు కేంద్ర ప్రభుత్వం పీఎం జన్మన్ ఇల్లు మంజూరు చేసిందని, ప్రస్తుతం సిమెంట్, ఐరన్, కూలి, ఇసుక, ఇటుక ధరలు పెరిగాయన్నారు. కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన రెండు లక్షల 39,000 రూపాయలు సరిపోవని, ఇళ్ల నిర్మాణానికి 10 లక్షల రూపాయలు పెంచాలని డిమాండ్ చేశారు. ఇళ్ల మంజూరైన లబ్ధిదారులకు ఉచితంగా ఇసుక ప్రభుత్వ పంపిణీ చేయాలని, గ్రామీణ ఉపాధి హామీ బకాయిలు వెంటనే చెల్లించాలన్నారు. కోదువలసలో తీవ్రమైన మంచినీటి ఎద్దడి ఉందని, వెంటనే మంచినీటి సౌకర్యం కల్పించాలన్నారు. లక్ష్మీపేట అడుగుల పుట్టు పంచాయతీ గ్రామాల్లో వీధిలైట్లు వెంటనే వేయాలన్నారు. అర్హులైన వృద్ధులకు పింఛను వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి బొండా సన్నిబాబు, పార్టీ మండల కమిటీ సభ్యులు కే. నర్సయ్య, పార్టీ సభ్యులు వెంకట్రావు, అధిక సంఖ్యలో పీఎం జన్మన్ లబ్ధిదారులు , గిరిజనులు పాల్గొన్నారు

ముంచింపుట్టు: మండలంలోని కరీముఖిపుట్ పంచాయతీ లోనీ పలు గ్రామాలలో సిపిఎం పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ప్రజా చైతన్య యాత్రలో సిపిఎం మండల నాయకులు గల్లెల నారాయణ, గల్లెల జీనబందు శుక్రవారం ప్రజా సమస్యలపై ఇంటింటికి వెళ్లి తెలుసుకున్నారు. గేదలబంధ, బరెంగుల గ్రామాల్లో తాగునీటి సమస్య, రోడ్డు నిర్మాణాలు, రేషన్ బియ్యం పంపిణీ వంటి సమస్యలను ప్రజలు వివరించారు. ఈ సందర్భంగా నాయకులు జీన బంద్ మాట్లాడుతూ, గేదల బంధ గ్రామంలో మంచినీరు సమస్య నెలకొందన్నారు.తక్షణమే మంచినీరు, సీసీ రోడ్డు సమస్య పరిస్కారం చేయాలని డిమాండ్ చేశారు. బరెంగుల గ్రామంలో 21రోజులు అవుతున్నా మార్చి నెల రేషన్ బియ్యం అందలేదన్నారు. అంత్యోదయ కార్డుదారులకు తక్షణమే బియ్యం పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు.వృద్ధాప్య, వితంతు, వికలాంగుల, పింఛన్లు మంజూరు చేయాలన్నారు. ఈ కార్యక్రమం లో గల్లెల నాగేశ్వరావు, లక్ష్మి, రాజు, నాగేశ్వరావు పాల్గొన్నారు..



ముంచంగిపుట్టులో..



మాట్లాడుతున్న ఉమామహేశ్వరరావు

నందిగుడలో సబ్ సెంటర్ ఏర్పాటు చేయండి

సిపిఎం జిల్లా నేత ఉమామహేశ్వరరావు

అరకులోయ రూరల్: సిపిఎం ప్రజా చైతన్య యాత్రలో భాగంగా శుక్రవారం మాడగడ పంచాయతీ నందిగుడ గ్రామంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వి ఉమామహేశ్వరరావు, మండల నాయకులు సింహాద్రి పర్యటించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సంధర్భంగా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ, నందిగుడ కేంద్రంగా సబ్ సెంటర్ ఏర్పాటు చేసి రోగులకు వైద్యం అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. అనారోగ్యం వచ్చిన గర్భిణీలు చెకప్ కోసం మాడగడ గ్రామానికి వెళ్లాల్సి వస్తుందని తెలిపారు. గ్రామంలో మంచి నీటి సమస్య సౌకర్యం తీవ్రంగా ఉందని తెలిపారు. నూతన రేషన్ కార్డులు అందక చాలా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని తెలిపారు. గ్రామంలో సీసీ రోడ్డు, డ్రైనేజీ వంటి సమస్యలు వెంటాడుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

అర్హులకు పూర్తి నష్ట పరిహారం చెల్లిస్తాం : సబ్ కలెక్టర్



మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ కల్పశ్రీ

ప్రజాశక్తి-రంపచోడవరం

నేషనల్ హైవే 516ఇ రహదారికి ఇరువైపులా గల కట్టడాలు కోల్పోయిన వారికి అవార్డులు ఎంపిక చేసిన వారికి నష్టపరిహారం పూర్తిగా చెల్లించడం జరుగుతుందని రంపచోడవరం సబ్ కలెక్టర్ కెఆర్.కల్పశ్రీ పేర్కొన్నారు. తన ఛాంబర్‌లో శుక్రవారం ఆమె మాట్లాడుతూ నేషనల్ హైవే 516ఇ రోడ్డు విస్తరణలో భాగంగా జరిగిన భూ సేకరణలో ప్రభుత్వ భూములలో కట్టడాలకుగాను భూమిరాసి పోర్టల్‌లో పేమెంట్ ప్రాసెస్ చేయడానికి రాజవొమ్మంగి, రంపచోడవరం మండలాలకు సంబంధించిన తహశీల్దార్లుకు పంపిన జాబితాలో ఉన్న వారు ఈ నెల 22న హాజరు కావాలని కోరారు. రాజవొమ్మంగి మండలానికి చెందిన వారు శనివారం ఉదయం 10 గంటల నుండి ఒంటిగంట వరకు, రంపచోడవరం మండలానికి సంబంధించిన వారు మధ్యాహ్నం 3 గంటల నుండి 4 గంటల వరకు రంపచోడవరం సబ్ కలెక్టర్ కార్యాలయంలో రావాలని సూచించారు. సదరు జాబితాలో ఉన్న వారందరూ బ్యాంక్ ఎకౌంట్‌కు సంబంధించిన పాసుబుక్కులు తప్పనిసరిగా తీసుకురావాలని కోరారు. నేషనల్ హైవే రోడ్డు విస్తరణలో నష్టం లేకుండా నిబంధనల ప్రకారం నష్టపరిహారం చెల్లించడం జరుగుతుందని ఆమె తెలిపారు.



పోక్స్ చట్టంపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న న్యాయమూర్తి రోహిత్

చట్టాలపై అవగాహన అవసరం

ప్రజాశక్తి-సీలేరు

విద్యార్థి దశలోనే చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని చింతపల్లి ప్రథమ శ్రేణి జుడిషల్ జడ్జి యం రోహిత్ అన్నారు. జీకే వీధి మండలం రింతాడ జిటిడబ్ల్యూఏ పాఠశాలలో పోక్సో చట్టంపై విద్యార్థులకు శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 సంవత్సరాల లోపు విద్యార్థులు మంచి మార్గంలో నడుచుకొని ఉన్నతమైన విద్యను అభ్యసించడానికి ఆలోచన చేయాలని సూచించారు. విద్యార్థులకు ఎటువంటి సమస్య వచ్చినా సంబంధిత శాఖ అధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పాపియమ్మ, ఉపాధ్యాయులు కృష్ణవేణి, సౌమ్య, లలిత, పారా లీగల్ వాలంటీర్లు పనసల చిట్టిబాబు, కృష్ణ, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

రక్తదాన శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి-పాడేరు: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన మెగా రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది.. విద్యార్థిని విద్యార్థులు, అధ్యాపకులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. కళాశాల ప్రిన్సిపల్ వనుము చిట్టబ్బాయి రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో అన్ని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రతి మూడు నెలలకు ఒకసారి రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థినీ విద్యార్థులు అధ్యాపకులు స్వచ్ఛందంగా రక్తదానం చేస్తున్నారని మరింత అవగాహన కలిగి రక్త దాతలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. గిరిజన రోగులకు రక్తం లేని పరిస్థితిలో ప్రాణాపాయం రాకుండా కాపాడేందుకు తమ వంతు కృషి చేస్తున్నామన్నారు. అపోహలను విడనాడి రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని ఔత్సాహితులకు పిలుపునిచ్చారు. ఈనెల 22న శనివారం చింతపల్లి డిగ్రీ కళాశాల లో నిర్వహిస్తున్న రక్తదాన శిబిరాన్ని కూడా విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జమాల్ బాషా సందర్శించి ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ చేస్తున్న సేవలను అభినందించారు. ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు స్వచ్ఛందంగా రక్తదానం చేసేందుకు ముందుకు రావడం ఆనందదాయకమని కొనియాడారు.సమాజంలో దుష్ప్రభావాలు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. జిల్లాలోని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సేవలు విస్తృతం చేస్తున్నారని కమిటీ సభ్యులను ప్రశంసించారు. ఈ రక్తదాన శిబిరంలో 16వ సారి రక్తదానం చేసిన విద్యార్థికీ సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ వైస్ చైర్మన్ ఎస్ గంగరాజు, కార్యదర్శి జి.గౌరీ శంకర్, కోశాధికారి పి సూర్యారావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొర్రా నాగరాజు, జిల్లా కార్యవర్గ సభ్యులు టి.ప్రసాద్ నాయుడు, సంజీవరావు, రవి, జిల్లా కోఆర్డినేటర్ సత్యనారాయణ, సుధాకర్, శ్యాంసుందర్, గంగారావు, కళాశాల సిబ్బంది, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



రక్తదాతను సన్మానిస్తున్న అధికారులు

పంటల సాగుపై అవగాహన

ప్రజాశక్తి-హుకుంపేట: ఇఫార్ట్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో స్తానిక వెలుగు కార్యాలయంలో శుక్రవారం రైతులకు వ్యవసాయ సాగు పంటలపై అవగాహన సదస్సు నిర్వహించారు. మండలంలోని రైతులు పండిస్తున్న వివిధ రకాల పంటలు పసుపు, మిరియాలు, అల్లం రైతులకు పంటలపై అవగాహన కల్పించడమే కాకుండా వాటి దిగుబడి, మార్కెట్, రాయితీలను రైతులను వివరించారు. ఈ కార్యక్రమంలో నాబార్డు డిడిఎం చక్రధర్, బిందు, ఆర్టికల్చర్ పరిశోధన శాస్త్రవేత్త, స్పైస్ బోర్డు ఎగ్జిక్యూటివ్, జిల్లా సీనియర్ అధికారి కళ్యాణి, డాట్ సెంటర్ శాస్త్రవేత్త డాక్టర్ ప్రదీప్, హార్టికల్చర్ టిఓ ప్రియాంక, అగ్రికల్చర్ ఆఫీసర్ లీలావతి పాల్గొన్నారు.



హాజరైన రైతులు



కరపత్రాన్ని ఇస్తున్న చిన్నయ్యపడాల్

బ్యాంకుల సమ్మెను విజయవంతం చేయండి

-సిఐటియు జిల్లా అధ్యక్షులు చిన్నయ్య పడాల్

ప్రజాశక్తి-చింతపల్లి: వివిధ బ్యాంకుల్లో పని చేస్తున్న ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఈనెల 24, 25 తేదీలలో బ్యాంకు ఉద్యోగులు సమ్మె నిర్వహిస్తున్నట్లు అల్లూరి జిల్లా సిఐటియు అధ్యక్షులు బోనంగి చిన్నయ్య పడాల్ అన్నారు. శుక్రవారం యూనియన్ బ్యాంకు, ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంకు ఉద్యోగస్తులతో చర్చించి సమ్మె విజయవంతనికి సహకరించాలని కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వివిధ బ్యాంకులలో ఖాళీగా ఉన్న పోస్టులను రెగ్యులర్, కాంట్రాక్టు పద్ధతిలో పోస్టులు భర్తీ చేయాలన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ద్వైపక్షిక ఒప్పందాలకు తూట్లు పొడుస్తున్నాయని, కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ ఆదేశాలను ఉపసంహరించుకోవాలని ఆయన ఆరోపించారు. బ్యాంకులలో ఖాళీలను భర్తీ చేయటం వలన ప్రభుత్వ రంగ సంస్థలలో పనిచేస్తున్న ఉద్యోగులకు పని భారం తగ్గుతుందన్నారు. ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్న సమయంలో అనేక రకాలుగా ఒత్తిడి లకు లొంగి ఉద్యోగుల ఆదాయాన్ని నష్టపోతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రెగ్యులర్ ఉద్యోగుల స్థానంలో నిర్దేశిత కాలర్ ఫిక్స్ టర్మ్ ఉద్యోగులు ప్రవేశిస్తున్నారని ఆయన ఆరోపించారు. బ్యాంకు కార్మికులు చేస్తున్న పోరాటానికి సిఐటియు సంపూర్ణ మద్దతు తెలుపుతుందని, బ్యాంకు కార్మికుల ఉద్యోగుల పట్ల తమ వైఖరి స్పష్టంగా ఉందని ఆయన స్పష్టం చేశారు. బ్యాంకు ఉద్యోగుల పట్ల యు ఎఫ్ బి యు నాయకత్వంలో ఉద్యోగులు, అధికారులు ఐక్యంగా చేస్తున్న సమ్మె పోరాటానికి తాము మద్దతిస్తున్నామన్నారు.

ముంచింగిపుట్టు: ఈనెల 24, 25 తేదీల్లో బ్యాంకు ఉద్యోగుల సమ్మెకు సిఐటియు సంపూర్ణ మద్దతు తెలియజేస్తుందని సిఐటియు మండల కార్యదర్శి కె శంకర్రావు తెలిపారు. మండల కేంద్రంలో ఏపీజీవీబీ బ్యాంకు మేనేజర్‌కు శుక్రవారం కరపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీ చేసి, తాత్కాలికంగా నియమితులైన వారిని రెగ్యులర్ చేయాలన్నారు. బ్యాంకు ఉద్యోగులు సమ్మెను జయప్రదం చేయాలని కోరారు.

బోరు మరమ్మతు చేపట్టాలి

ప్రజాశక్తి -ముంచింగిపుట్టు: మండలంలోని మాకవరం గ్రామంలో గత పది రోజులుగా బోరు బావి మరమ్మత్తులకు గురవడంతో సుమారు 30 కుటుంబాల గిరిజనులు తాగునీటికి అనేక అవస్థలు ఎదుర్కొంటున్నామని సిపిఎం నాయకులు మఠం నర్సింగ్ పడాల్ శుక్రవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం తాగునీటి బోరు, బావి మరమ్మత్తులకు గురి కావడంతో చాలా ఇబ్బంది పడుతున్నారన్నారు. బోరు మరమ్మతు చేపట్టాలని కోరారు.

గిరిజనులు, గిరిజనేతరుల మధ్య

భూ వివాదంపై గ్రామసభ

ప్రజాశక్తి-కొయ్యూరు

కొయ్యూరు మండలం బంగారంపేటలో ఆదివాసీలు, గిరిజనేతరుల మధ్య భూ వివాదంపై విఆర్ఓ జోగులమ్మ, సచివాలయం సర్వేయర్, మహిళా పోలీస్ ఆధ్వర్యంలో శుక్రవారం గ్రామసభ నిర్వహించారు. ముందుగా గొలుగొండ మండలం కేడీ.పేట గ్రామానికి చెందిన గిరిజనేతరులు దుళ్ళ శ్రీనివాసరావు, దలే కావమ్మ మాట్లాడుతూ బంగారంపేటలో సర్వే నెంబర్ 90లో 14 ఎకరాల 31 సెంట్లు భూమిని 1963లో తమ పూర్వికులు నర్సీపట్నంలో ఉండే గిరిజనేతరుల వద్ద కొనుగోలు చేసినట్టు తెలిపారు. ఈ భూమిని రిజిస్ట్రేషన్ చేశారని, శిస్తు కడుతున్నామని, రెవెన్యూ అధికారులు వెబ్ ల్యాండ్‌లో నమోదు చేసి పట్టాలు (1బి) ఇవ్వడం జరిగిందని చెప్పారు. గిరిజనుడు మాదల లోవకుమార్ మాట్లాడుతూ తమ పూర్వీకుడు మాదల తిరుపతయ్య పేరున అడంగల్‌లో సర్వే నెంబర్ 90లో 14 ఎకరాల 31 సెంట్లు భూమి నమోదై ఉందని, తమ పూర్వికులు ఎవరికి అమ్మినట్లు గాని, ఎవరైనా కొనుగోలు చేసినట్లుగాని లేదని తెలిపారు. 5 షెడ్యూల్ ప్రాంతంలో 1/70 చట్టం అమలులో ఉన్నందున గిరిజనేతరులు భూమి కొనుగోలు చేయడానికి, సాగు చేయడానికి వీలు లేదని, అందువల్ల ఈ భూమి తమదని లోవకుమార్ స్పష్టం చేశారు. దీంతో వారి మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. దీంతో విఆర్ఓ స్పందిస్తూ ఇరు వర్గాల వాదనలను రిపోర్ట్ రాసి మండల తహసీల్దార్‌కు తెలియజేస్తామని చెప్పారు. ఆదివాసీ జెఎసి జిల్లా కమిటీ సభ్యులు ఎస్ అశోక్‌లాల్, పాడి లవరాజు, ఉల్లి సూరిబాబు మాట్లాడుతూ ఆదివాసీలకు గిరిజనేతరులకు మధ్య ఈ వివాదం తొందరగా పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి విరవాడ దేవుడు, మాజీ ఎంపిటిసి పాంగి చిట్టిబాబు, సర్పంచ్ పాంగి రాజుబాబు, పీసా కమిటీ సభ్యులు సెగ్గె సోమరాజు, కూడా రాజు, రావణాపల్లి సర్పంచ్ కె.చంద్రరావు, అంతాడ సర్పంచ్ సుర్ల చంద్రరావు, సతీష్, మాదల సత్యనారాయణ, పాంగి చంద్రరావు, పాంగి నానిబాబు, కె.రామకృష్ణ, పాంగి రాజుబాబు, మాదల శేఖరబాబు, మాదల రమేష్, ఉల్లి నాగరాజు, లోత చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.



గ్రామసభలో పాల్గొన్న ఇరు గ్రూపుల వారు, అధికారులు

ఉచిత మెగా వైద్య శిబిరం

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

మండలంలోని ఏబీ కాలనీ గ్రామంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు జి.శేషగిరిరావు ఆధ్వర్యంలో విశాఖపట్నం మెడీకవర్ ఆసుపత్రి వైద్యులు శుక్రవారం మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరాన్ని రంపచోడవరం మాజీ ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి ప్రారంభించారు. వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. వైద్య శిబిరంలో వివిధ రుగ్మతలతో బాధపడుతున్న రోగులకు వైద్యులు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గోము వెంకటలక్ష్మి, వైఎస్ ఎంపీపీ జుర్రా రాజేశ్వరి, అమీనాబాద్ సర్పంచ్ కించు వెంకటలక్ష్మి, జడ్డంగి సర్పంచ్ కొంగర మురళీకృష్ణ, వైసీపీ నేతలు జుర్రా జానుబాబు, దాట్ల వెంకటేశ్వరరాజు, చెదులూరు రాజబాబు, చెదులూరు ఆర్జిబాబు, ఎన్.కుశరాజు, కనిగిరి దుర్గప్రసాద్, ఆధ్య రమేష్, ముంగారి నాని, సురేష్, అప్పారావు తదితరుల పాల్గొన్నారు.



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే ధనలక్ష్మి

చింతపండుకు గిరాకీ

ప్రజాశక్తి-కొయ్యూరు : ఏజెన్సీలో పుష్కలంగా దొరికే చింతపండు మండలంలోని మారుమూల గ్రామాలలో ఈ ఏడాది పెద్దగా కాపు, దిగుబడి లేకపోవడంతో చింతపండుకు డిమాండ్ పెరిగింది. చింత చెట్లు ఎక్కువగా కాయపోవడంతో పాటు కోతుల సంఖ్య విపరీతంగా పెరిగిపోవడం కూడా ఇందుకు కారణమని స్థానికులు, వ్యాపారులు అంటున్నారు. పక్వానికి వచ్చిన చింతపండును కోతులు పాడు చేస్తున్నాయని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో పిక్కతో ఉన్న చింతపండు గత ఏడాది క్వింటాల్ రూ.4000 కాగా, ప్రస్తుతం రూ.6000 పలుకుతోంది.





యువకులకు వాలీబాల్ కిట్లు అందిస్తున్న టిడిపి నేత పెద్దిరాజు

మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహదం

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

మానసిక ఉల్లాసానికి, శరీర దారుఢ్యానికి క్రీడలు ఎంతగానో దోహదపడతాయని లబ్బర్తి ఎంపీటీసీ, టిడిపి మండల అధ్యక్షులు గొల్లపూడి పెద్దిరాజు అన్నారు. స్థానిక కమ్మరిపేటకు చెందిన గిరిజన యువతకు ఆయన శుక్రవారం వాలీబాల్ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏజెన్సీలో గిరిజన యువత ఎటువంటి చెడు వ్యసనాలకు బానిస కాకుండా చదువుతోపాటు క్రీడలపై ఆసక్తి కనబరచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నేతలు చిన్న, అప్పు, రవి తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ అభివృద్ధికి కృషి



బాధ్యతలు స్వీకరిస్తున్న కాకర సంధ్యారాణి

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం, పంచాయతీ అభివృద్ధికి కృషి చేస్తానని రాజవొమ్మంగి పంచాయతీ కార్యదర్శి కాకర సంధ్యారాణి అన్నారు. రాజవొమ్మంగి మేజర్ పంచాయతీ గ్రేడ్-3 కార్యదర్శిగా సంధ్యారాణి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆమె గతంలో ఏలేశ్వరం మండలం ఎర్రవరం గ్రామపంచాయతీలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేసి ఉద్యోగోన్నతిపై రాజవొమ్మంగి పంచాయతీ కార్యదర్శగా వచ్చారు. కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన సంధ్యారాణిని సచివాలయ ఉద్యోగులు, పంచాయతీ సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

మావోయిస్టులకు వ్యతిరేకంగా ర్యాలీ

ప్రజాశక్తి-చింతూరు : మావోయిస్టులకు వ్యతిరేకంగా శుక్రవారం మండలంలోని ఏడుగురాళ్లపల్లి సంతలో ఆదివాసీ యువకులు బ్యానర్లు పట్టుకొని ర్యాలీ నిర్వహించారు. అమాయక ఆదివాసీలను చంపడమేనా మావోయిస్టుల సిద్ధాంతమని ప్రశ్నించారు.అభివృద్ధిని అడ్డుకుంటూ ఆదివాసీలను చంపుకుంటూ పోతే సహించేది లేదని హెచ్చరించారు. ఆదివాసీల అభివృద్ధికి ఆటంకంగా ఉన్న మావోయిస్టులు చర్యలు నిలిపివేయాలని నినాదాలు చేశారు.



ఎన్ఆర్ఐ విద్యార్థి యాప్‌తో పది మందికి గుండె వ్యాధుల నిర్ధారణ



ఎన్ఆర్ఐవిద్యార్థి సిద్ధార్థ్‌తో జిల్లా కేంద్ర ఆసుపత్రి వైద్యులు

ప్రజాశక్తి పాడేరు :- జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ ఆదేశాల మేరకు శుక్రవారం పాడేరు జిల్లా కేంద్ర ఆసుపత్రిలో 250 మంది రోగులకు గుండె సంబంధిత వ్యాధుల నిర్ధారణకు ఎన్ఆర్ఐ విద్యార్థి నంద్యాల సిద్ధార్థ్ కనిపెట్టిన సర్కేడియన్ వి యాప్ ద్వారా పరీక్షలు నిర్వహించారు. పది మందికి గుండె సమస్యలు గుర్తించడం జరిగిందని జిల్లా కేంద్ర ఆసుపత్రి మేడికల్ పర్యవేక్షకురాలు విశ్వమిత్ర తెలిపారు. ఆ పది మందికి జనరల్ మెడిసిన్ నిపుణులు సురేశ్వర రెడ్డి ఆధ్వర్యంలో 2డి ఎకో, ఇ.సి.జి పరీక్షలు నిర్వహించగా వారు గుండె జబ్బులతో బాధపడ్తున్నట్లు నిర్ధారించారమన్నారు. వెంటనే వారిని కార్డియాలజీకి రిఫర్ చేయడం జరిగిందన్నారు. ఈ స్క్రీనింగ్ పరీక్షలు శనివారం కూడా పాడేరు జిజిహెచ్‌లో నిర్వహిస్తామని, ఈ అవకాశాన్ని హృద్రోగులు వినియోగించుకోవాలని విశ్వమిత్ర సూచించారు. 14 ఏళ్ల ఎన్ఆర్ఐ విద్యార్థి సిద్ధార్థ్ నంద్యాల కనిపెట్టిన ఈ సర్కేడియన్ వి యాప్ ఏ వన్ (ఆర్టిఫిసియల్ ఇంటలిజెన్స్) ను ఉపయోగించి కేవలం ఏడు సెకన్లలో గుండె జబ్బులను గుర్తిస్తుందని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో జనరల్ మెడిసిన్ నిపుణులు సురేశ్వర రెడ్డి, ఎన్ఆర్ఐ విద్యార్థి నంద్యాల సిద్ధార్ధ్, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు డుంబ్రిగుడ మండల సమావేశం

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: మండల పరిషత్తు కార్యాలయ సమావేశ మందిరంలో ఈనెల 22న శనివారం సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనున్నామని ఎంపీడీవో ప్రేమాసాగర్ శుక్రవారం తెలిపారు. ఎంపీపీ ఈశ్వరి అధ్యక్షతన సమావేశం జరుగుతుందన్నారు. మండల అభివృద్ధికి ప్రణాళికను రూపొందించడం జరుగుతుందని చెప్పారు. మండల పాలకవర్గ సభ్యులు, సర్పంచ్‌లు, అధికారులు తప్పక హాజరు కావాలని ఆయన కోరారు.

విలేజ్ హెల్త్ క్లినిక్‌కు ఫర్నీచర్



ఆసుపత్రికి దివీస్ సమకూర్చిన ఫర్నీచర్

ప్రజాశక్తి -తగరపువలస : మండలంలోని టి నగరపాలెం విలేజ్ హెల్త్ క్లినిక్‌కు రూ. 95 వేల సిఎస్ఆర్ నిధులతో ఫర్నిచర్‌ను శుక్రవారం చిప్పాడ దివీస్ సంస్థ సమకూర్చింది. ఔషధాలు భద్రపరిచే బీరువా, రోగులు కూర్చునేందుకు మూడు సీట్ల కుర్చీలు, ఐరన్‌బెడ్, చుట్టూరా సేఫ్టీ గ్రిల్‌ను సమకూర్చారు. స్థానిక సర్పంచ్ పొట్నూరు ఛాయాగౌతమి, గ్రామపెద్దలు చంద్ర శేఖర్ విజ్ఞప్తి మేరకు దివీస్ సంస్థ సిఎస్ఆర్ నిధులతో వీటిని సమకూర్చినట్లు సిఎస్ఆర్ మేనేజర్ డి సురేష్ కుమార్ తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు చంద్రశేఖర్, పల్లా సన్యాసిరావు, కార్యదర్శి శశికళ, సిహెచ్ఒ స్వాతి, సిఎస్ఆర్ ప్రతినిధులు శ్రీనివాస్, పి శేఖర్‌బాబు, కనకరాజు, ఎఎన్ఎం రమణకుమారి పాల్గొన్నారు

ఉపాధి నిధులతో ఫారం పాండ్స్ నిర్మించాలి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్, అధికారులు

ప్రజాశక్తి-పాడేరు: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా అల్లూరి జిల్లాలో చేపడుతున్న వివిధ అభివృద్ధి పనులు, ప్రాజెక్టులపై రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ జిల్లా కలెక్టర్, అధికారులతో వీడియో కాన్ఫరెన్సులో సమీక్షించారు. శుక్రవారం ఆయన సచివాలయం నుంచి వివిధ జిల్లాల కలెక్టర్లు, ఇతర అధికారులతో నిర్వహించిన వీసీలో ఆయన ఉపాధి హామీ అనుబంధ ప్రాజెక్టులపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా అల్లూరి జిల్లాలో ఫారం పాండ్స్ కు ఎక్కువ అవకాశం ఉన్నందున 10,500 ఫారం పాండ్స్ నిర్మించాలని, తద్వారా నీటి వసతి మెరుగు పరచి అధిక ఉత్పత్తులు సాధించాలని కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ ను ఆదేశించారు.

తదుపరి దశలో పశువుల షెడ్లకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. ఉపాధి హామీ పథకం అమలులో పూర్తి పారదర్శకత పాటించి ప్రజలకు అండగా నిలవాలని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ అత్యధిక పనిదినాలు కల్పించాలని, ఆర్థిక భరోసా కల్పించాలని ఆదేశించారు. పల్లెపండగలో భాగంగా చేపట్టిన పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. కలెక్టరేట్ వీసీ హాలు నుంచి జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్, డ్వామా పిడి విద్యాసాగర్, జిల్లా గ్రామపంచాయతీ అధికారి లవ రాజు, ఐసిడిఎస్ పిడి సూర్య లక్ష్మి పాల్గొన్నారు.

డిగ్రీ ఫైనలియర్ విద్యార్థులకు ఆత్మీయ వీడ్కోలు



ఫేర్‌వెల్ ఫంక్షన్‌లో మాట్లాడుతున్న అరకు సీఐ ఎల్ హిమగిరి

ప్రజాశక్తి-అరకులోయ రూరల్: అరకులోయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫేర్ వెల్ డే వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు చేసిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన అరకు సర్కిల్ ఇన్స్పెక్టర్ హిమగిరిను సత్కరించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడారు. విద్యార్థులందరూ ఉన్నత స్థాయిని అధిరోహించాలన్నారు. విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. గంజాయి, నాటు సారా, ఖైనీ, గుట్కా ,సైబర్ క్రైమ్‌లకు దూరంగా ఉండాలని సూచించారు. ఈ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె భరత్ కుమార్ నాయక్, సిపిడిసి నెంబర్ మయూరి రాజు, ఐక్యు ఎసి కోఆర్డినేటర్ డాక్టర్ పి కొండబాబు, ఎన్ఎస్ఎస్ పిఒలు పి.నాగబాబు, వై విజయలక్ష్మి, ఎం.అనిత కుమారి, మహిళా కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కె ధర్మారావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

శంకర్ ఫౌండేషన్‌కు అంబులెన్స్ వితరణ



అంబులెన్స్‌ను ప్రారంభిస్తున్న గెయిల్ జిఎంలు

ప్రజాశక్తి- వేపగుంట : శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రికి గ్యాస్ అథారిటీ ఆఫ్ ఇండియా (గెయిల్) కార్పొరేట్ సామాజిక బాధ్యతగా రూ.27.50 లక్షల విలువైన అధునాతన అంబులెన్స్‌ను సమకూర్చింది. శుక్రవారం గెయిల్ చీఫ్ జిఎం (ఓఅండ్ఎం పైపులైన్) ఎల్ఎస్.రావు, జిఎంఎంవిఎస్.మూర్తి అంబులెన్స్‌ను శంకర్ ఫౌండేషన్ జిఎం కెరాధాకృష్ణన్‌కు అందజేశారు. ఈ సందర్భంగా గెయిల్ జిఎం ఎల్ఎస్.రావు మాట్లాడుతూ, సమాజానికి పేదప్రజల అంధత్వ నివారణకు శంకర్ ఫౌండేషన్ చేస్తున్న సేవలను కొనియాడారు. ఫౌండేషన్ చేస్తున్న ప్రజారోగ్యసేవకు సహకారంగా తమవంత బాధ్యతగా అంబులెన్స్ అందించామన్నారు. గెయిల్ యాజమాన్యానికి శంకర్ ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ ఎ.కృష్ణకుమార్, జిఎం కె రాధాకృష్ణన్, కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో డిజిఎం వి.రమేష్ కుమార్, శంకర్ ఫౌండేషన్ డిజిఎం (పిఆర్) కె.బంగార్రాజు, గెయిల్ డిజిఎం స్టీఫెన్ పట్టా, చీఫ్ మేనేజర్ (హెచ్ఆర్) మదన్ కులాడే, మేనేజర్ (ఫైనాన్స్) ఎ కిరణ్, సిఎస్ఆర్ సభ్యులు పాల్గొన్నారు.

కేంద్రీయ విద్యాలయ మూసివేతకు కుట్ర

ప్రజాశక్తి-ఉక్కునగరం : కేంద్రీయ విద్యాలయాన్ని మూసివేయాలనే కుట్రతోనే ఒకటో తరగతి అడ్మిషన్లను స్టీల్ ప్లాంట్ యాజమాన్యం నిలుపుదల చేసిందని 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి గంగారావు విమర్శించారు.. శుక్రవారం పాఠశాల ఆవరణలో అడ్మిషన్లు ప్రారంభించాలని కోరుతూ నిరసన చేపట్టారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ, స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం ఖర్చు తగ్గించుకోవడానికి విద్యార్థులకు ఇప్పుడు చౌకగా అందుతున్న విద్యను దూరం చేసే కుట్ర జరుగుతోందన్నారు. పాఠశాలలో అడ్మిషన్లు ప్రారంభించాలని స్థానిక ఎంపీ శ్రీభరత్‌తో కలిసి స్టీల్‌ప్లాంట్ యాజమాన్యాన్ని కోరినా ఎటువంటి ప్రయోజనం లేదన్నారు. ఆయా విద్యాలయాల కోసం కూటమి నేతలు కనీసం పట్టించుకోవడం లేదని ఆక్షేపించారు. ఈ పాఠశాలలో పనిచేస్తున్న ఉద్యోగులను ఇతర కేంద్రీయ విద్యాలయాలకు తరలించి, పూర్తిగా ప్రైవేటుపరం చేయాలన్న కుట్ర మానుకోవాలని, తక్షణమే విశాఖ విమల విద్యాలయం, కేంద్రీయ పాఠశాలలలో ఒకటో తరగతి అడ్మిషన్లను ప్రారంభించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో స్థానికులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఉన్నారు.

హౌసింగ్ అధికారుల పర్యటన

ప్రజాశక్తి-హుకుంపేట: పిఎమ్ఏవై గృహాలను లబ్ధిదారులకు సద్వినియోగం చేసుకోవాలని హౌసింగ్ పి డి బి.బాబునాయుడు ఆయన సూచించారు. మండలంలోని తీగలవలస పంచాయతీలో శుక్రవారం ఏఈ చిన్న బాబు, స్థానిక గ్రామ సర్పంచ్ బేసుతో కలిసి పర్యటించారు. అనంతరం హౌసింగ్ పీడీ మాట్లాడుతూ పీఎం జన్మన్ కింద 1946 ఇల్లులను, పీఎం ఏవైలో భాగంగా 582 గృహాలు మండలానికి మంజూరు చేశామన్నారు. ఇది వరకు ఇస్తున్న యూనిటీ కాస్టుకు అదనంగా పివిటిజిలకు ఒక లక్ష రూపాయలు, ఇతర షెడ్యూల్ కులాలకు 75 వేల రూపాయలు అదనంగా మంజూరు చేశారని ఆయన వివరించారు.

చంద్రబాబును కలిసిన గిడ్డి ఈశ్వరి



సిఎం చంద్రబాబుతో మాజీ ఎమ్మెల్యే ఈశ్వరి

ప్రజాశక్తి-పాడేరు టౌన్: అల్లూరి జిల్లా కేంద్రం పాడేరు కుమ్మరిపుట్టులోని తన నివాసంలో సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ప్రతి శనివారం ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక వేదిక నిర్వహించడం జరుగుతుందని టిడిపి ఇన్చార్జి, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి తెలిపారు. శుక్రవారం ఆమె అమరావతిలోని సచివాలయంలో ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి నియోజకవర్గ సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం గ్రీవెన్స్ నిర్వహించాలని సిఎం ఆదేశించారని ఈశ్వరి తెలిపారు. గత ప్రభుత్వం సరిగా పనిచేయకపోవడంతో సమస్యలు ఉన్నాయని చెప్పారు. నియోజకవర్గంలో ప్రతి గ్రామంలో ఏమైనా సమస్యలు ఉంటే ప్రజలు తమ దృష్టికి ఈ వినతుల ద్వారా తీసుకొని వస్తే సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఈ ప్రజా సమస్యల పరిష్కార ప్రత్యేక వేదికను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

చెట్టు పై నుంచి జారిపడి గిరిజనుడు మృతి

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: మండలంలోని పోతంగి పంచాయతీ పెదపాడులో ఓ గిరిజనుడు జీలుగు చెట్టెక్కి ప్రమాదవశాత్తు జారిపడి మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు. పెదపాడు గ్రామానికి చెందిన బడ్నాయిని బాలన్న (55) అనే గిరిజనుడు గురువారం రాత్రి ఎనిమిది గంటలకు జీలుగు చెట్టెక్కాడు. చెట్టు నుంచి ప్రమాదవశాత్తు జారిపడి అక్కడిక్కడే బాధితుడు మృతి చెందాడు.. ఈ విషయంపై స్థానిక పోలీసు స్టేషన్‌లో బాధిత కుటుంబీకులు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు మృతదేహాన్ని శవ పంచనామాకు అరకులోయ ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు.

నేడు ఆదర్శ డిగ్రీ కాలేజీలో జాబ్‌మేళా

ప్రజాశక్తి-పెందుర్తి,: స్థానిక ఆదర్శ డిగ్రీ కళాశాలలో నిర్మన్ ఆర్గనైజేషన్ సంయుక్త సహకారంతో ఈ 22న మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కాలేజీ ప్రిన్సిపల్ ఎస్ఇ.ఫ్లోరా తెలిపారు. డబుల్ యుఎన్ఎస్, అమెజాన్, కాంసెంట్రిక్స్, యొకోహోమ, హ్యుందాయ్, మొబిస్, పొలగని, విస్ట్రోన్, సెన్సాకోర్ మెడికల్ కిట్స్ కంపెనీ, జేకే ఫెన్నర్ ఆటో మొబైల్ స్పేర్ పార్ట్స్ కంపెనీ, ఎమ్ ఆర్ ఎఫ్ మ్యానుఫ్యాక్చర్ కంపెనీ, అపెక్స్, ఫాక్సకాన్ హియర్ బడ్స్ కంపెనీ, వరుణ్ మోటార్స్, శ్రీరామ్ ఫైనాన్స్ తదితర 14 కంపెనీల ప్రతినిధులు పాల్గొని, ఉద్యోగార్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించి, బిపిఒ, ఐటిఎఎస్, కస్టమర్ సర్వీస్, మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్స్ తదితర ఉద్యోగాలకు అర్హులను ఎంపిక చేస్తారన్నారు. డిగ్రీ, ఐటిఐ, ఇంటర్, టెన్త్ ఉత్తీర్ణత కలిగిన యువతీ, యువకులు జాబ్‌మేళాలో పాల్గొనవచ్చని, ఎంపికైన వారికి రూ.1.5లక్షల నుంచి రూ. 2.5లక్షల వరకు వార్షిక వేతనం ఉంటుందన్నారు. డిగ్రీ ఫైనలియర్ విద్యార్థులు జాబ్‌మేళాలో పాల్గొనవచ్చునికళాశాల సెక్రటరీ టి థియోఫిలస్ తెలిపారు. మరిన్ని వివరాలకు 9154938472, 9154938478 మొబైల్ నెంబర్లను సంప్రదించాలన్నారు.



సమావేశంలో పాల్గొన్న గ్రంథాలయ ఉద్యోగులు, పెన్షనర్లు

గ్రంథాలయ సంస్థ ఉద్యోగులకు.. 010 పద్దు కింద జీతాలు ఇవ్వాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : గ్రంథాలయ సిబ్బంది చిరకాలంగా కోరుతున్న 010 పద్దు కింద జీతాలు, పెన్షన్లు ఇవ్వాలని శుక్రవారం సిఐటియు జిల్లా కార్యాలయంలో జరిగిన ఉత్తరాంధ్ర జిల్లాల గ్రంథాలయ సిబ్బంది, పెన్షనర్ల సంయుక్త సమావేశం ప్రభుత్వాన్ని కోరుతూ తీర్మానించింది. స్థానిక సంస్థలు వసూలు చేస్తున్న గ్రంథాలయ సెస్సును నేరుగా జిల్లా గ్రంథాలయ సంస్థల అకౌంటుకు జమ చేయాలని, గ్రంథాలయ సంస్థలకు ప్రభుత్వం నుండి రావలసిన బకాయి గ్రాంటును వెంటనే విడుదల చేయాలని, ఇతర అనేక సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ సమావేశం వివిధ తీర్మానాలను ఆమోదించింది. తూర్పుగోదావరి జిల్లాతో కలుపుకొని ఉత్తరాంధ్ర జిల్లాల గ్రంథాలయ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు పి.మల్లేశ్వరరావు కన్వీనర్‌గా పది మందితో కమిటీ ఏర్పడింది. పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సలాది సత్యనారాయణ మాట్లాడుతూ గ్రంథాలయాలను ఆధునికీకరిస్తామని రాష్ట్ర గ్రంథాలయాలు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ అసెంబ్లీలో ప్రకటించిన నేపథ్యంలో ఈ సమావేశాన్ని ఏర్పాటు చేసినట్టు తెలిపారు. సీనియర్ నాయకులు బి.ఆనందరావు, శ్రీకాకుళం జిల్లా పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు వైకుంఠరావు, విజయనగరం జిల్లా పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు రామభద్రరాజు, జిల్లా ఉద్యోగుల సంఘం అధ్యక్షులు కె.శ్రీనివాసరావు, విశాఖ జిల్లా ఉద్యోగుల సంఘం అధ్యక్షులు ఆనందరావు వివిధ సమస్యలపై మాట్లాడారు. ఉమ్మడి విశాఖ జిల్లా పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు కె.త్రిమూర్తులు అధ్యక్షత వహించారు. తూర్పుగోదావరి, ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి గ్రంథాలయ ఉద్యోగులు, నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

బిఎస్ఎన్ఎల్ కేబుల్ దొంగల ముఠా అరెస్టు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖపట్నంలోని ద్వారకా క్రైమ్ సబ్ డివిజన్ పరిధిలో ఎంవిపి.కాలనీ ప్రాంతంలో సుమారు 2.4 లక్షల విలువగల బిఎస్ఎన్ఎల్ వైర్లను దొంగిలించిన ఎనిమిది మంది సభ్యుల ముఠాను అరెస్టు చేసినట్టు ద్వారకా క్రైమ్ ఇన్‌స్పెక్టర్ చక్రధరరావు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఉదయం ఎంవిపి పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన కేసు వివరాలను వెల్లడించారు. ఈ నెల 13వ తేదీ సాయంత్రం బిఎస్ఎన్ఎల్ సంస్థలో ఇంజినీర్‌గా పనిచేస్తున్న చుట్టారు మురళి తమ సంస్థకు చెందిన సుమారు 300 కేజీల బరువుగల రూ.2.4 లక్షల విలువచేసే రాగి వైర్లు చోరీకి గురయ్యాయ, గుర్తు తెలియని వ్యక్తులు ఎంవిపి డబుల్ రోడ్డు ప్రాంతంలో రాత్రిపూట రోడ్డును తవ్వి ఈ చోరీకి పాల్పడ్డారని చేసిన ఫిర్యాదు మేరకు క్రైమ్ ఎఎస్ఐ డి.కిషోర్ బాబు, హెడ్ కానిస్టేబుల్ జి.వెంకటేశ్వరరావు, కానిస్టేబుల్ హరిప్రసాద్‌లు బృందంగా ఏర్పడి ఆ ప్రాంతంలోని సీసీ కెమెరాలను పరిశీలించగా కొంతమంది వ్యక్తులు రాత్రి సమయంలో జివిఎంసి ఉద్యోగుల వలే వచ్చి రోడ్డును తవ్వినట్లు గుర్తించారు.

అనంతరం సాంకేతిక ఆధారాల సహాయంతో విశాఖ నగరానికి చెందిన ఆసనాల పిట్టోడు, తెలంగాణ రాష్ట్రం నల్గొండ జిల్లాకు చెందిన గుంజ గోవర్ధన్, పశ్చిమగోదావరి జిల్లా ఏలూరుకు చెందిన బత్తుల శ్రీను, బత్తుల ఏడుకొండలు, బత్తుల రాజు, చీకూరి దుర్గాప్రసాద్, దేవల రాజేష్, బత్తుల ప్రసాద్‌లను ముద్దాయిలుగా గుర్తించి అరెస్టు చేశారు. అనంతరం వారి వద్ద నుండి రూ.2.4 లక్షల విలువగల 300 కేజీల కాపర్ వైరును, నేరానికి ఉపయోగించిన టాటా ఏస్ వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. నిందితులను రిమాండ్‌కు పంపారు. మీడియా సమావేశంలో ఎంవిపి క్రైమ్ ఎస్ఐ రాజు పాల్గొన్నారు.

సాంకేతిక సవాళ్లను ఎదుర్కొనే చట్టాలు అవసరం

హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి యు.దుర్గాప్రసాదరావు

ఎయులో జాతీయ స్థాయి మూట్ కోర్టు పోటీలు ప్రారంభం



మాట్లాడుతున్న దుర్గాప్రసాదరావు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఆధునిక సాంకేతికత విసిరే సవాళ్లకు సమాధానమిచ్చే పటిష్టమైన చట్టాలను రూపకల్పన చేయాల్సిన అవసరముందని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ యు.దుర్గా ప్రసాదరావు అన్నారు. ఎయులోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ న్యాయ కళాశాలలో శుక్రవారం జాతీయ స్థాయి మూట్ కోర్టు పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమాజ అవసరాలకు అనుగుణంగా చట్టాల్లో మార్పులు వస్తాయని తెలిపారు. శాస్త్రీయ ఆవిష్కరణలు సమాజానికి ఎంతో మేలు చేస్తున్నాయని, అదే సమయంలో కొన్ని కొన్ని సవాళ్లు సైతం ఎదురవుతున్నాయని ఉదాహరణలతో వివరించారు. న్యాయవాదులు, న్యాయ విద్యార్థులు ప్రపంచ వ్యాప్తంగా జరుగుతున్న మార్పులను నిశితంగా గమనించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. గతంలో వచ్చిన ఎన్‌డిపిఎస్ చట్టం ప్రాధాన్యతను వివరించారు. గత నాలుగు సంవత్సరాలలో దేశ వ్యాప్తంగా రూ.13 వేల కోట్ల విలువైన మత్తు పదార్థాలను పట్టుకున్నారని చెప్పారు. ఇంటర్నెట్ ఆగమనంతో వచ్చిన ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ యాక్ట్ గురించి వివరించారు. సైబర్ నేరాలు, శిక్షలు ఏ విధంగా విధిస్తారు ? అనే అంశాలను తెలియజేశారు. న్యాయవాద వృత్తి సోషల్ ఇంజినీరింగ్ అని చెప్పారు. గత దశాబ్ద కాలంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ తెర మీదకు వచ్చిందని, దీనిని విరివిగా వినియోగిస్తున్నారని తెలిపారు. మేధో హక్కులకు భంగం కలిగే అవకాశం దీంతో ఏర్పడుతోందని చెప్పారు. అదేవిధంగా కాపీరైట్ చట్టం ఉల్లంఘన జరిగే అవకాశాలు సైతం ఏర్పడుతున్నాయని అన్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో దేశంలో మేధో చర్చలు జరగాలని సూచించారు. ఎయు విసి ఆచార్య జిపి.రాజశేఖర్ మాట్లాడుతూ యువ న్యాయ విద్యార్థులకు అవగాహన కల్పించే విధంగా ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం మంచి పరిణామమన్నారు. దేశ వ్యాప్తంగా 24 విద్యాసంస్థల నుంచి విద్యార్థులు పాల్గొనడం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో న్యాయ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య కె.సీతామాణిక్యం, ఆచార్య వై.సత్యనారాయణ, ఆచార్య వి.కేశవరావు, ఆచార్య ఎస్.సుమిత్ర, ఆచార్య వి.రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. తొలి రోజు మూట్ కోర్టు ప్రిలిమినరీ పోటీలు నిర్వహించారు.

చెరుకు రైతుల కన్నెర్ర

గోవాడ సుగర్ ఫ్యాక్టరీ వద్ద మహా ధర్నా, రాస్తారోకో

బకాయిలు చెల్లించాలని, క్రషింగ్ సజావుగా జరిగేలా చూడాలని డిమాండ్



రోడ్డుపై బైఠాయించిన చెరుకు రైతులు

ప్రజాశక్తి - చోడవరం : గోవాడ సుగర్ ఫ్యాక్టరీ పరిధిలోని చెరుకు రైతులు కన్నెర్రజేశారు. తమ సమస్యలను పరిష్కరించాలంటూ శుక్రవారం ఫ్యాక్టరీ ఎదుట మహాధర్నాకు దిగారు. బకాయిలు చెల్లించాలని, క్రషింగ్ సజావుగా జరిగేలా చూడాలని, చెరుకుకు గిట్టుబాటు ధర కల్పించాలని పెద్దపెట్టున నినదించారు. గోవాడ సుగర్ ఫ్యాక్టరీ చెరుకు రైతుల పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ మహా ధర్నాకు ముఖ్య అతిథిగా చెరుకు రైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మర్రాపు సూర్యనారాయణ హాజరై రైతులను ఉద్దేశించి మాట్లాడారు. చెరుకు రైతులకు బకాయిలను వెంటనే చెల్లించాలని, క్రషింగ్ సజావుగా జరిగేందుకు యాజమాన్యం తక్షణ చర్యలు చేపట్టాలని, లేకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఎపిలోని చెరుకు రైతుల పరిస్థితి దినదినగండంగా మారిందన్నారు. నూతన వంగడాలను ప్రవేశ పెట్టకపోవడం వల్ల చెరుకు దిగుబడి తగ్గి, ఖర్చులు పెరిగి రైతులకు నష్టాలు వాటిల్లుతున్నాయన్నారు. కనీస గిట్టుబాటు ధర రూ.5 వేలు చెల్లిస్తే తప్ప రైతులు చెరుకు సాగు చేసే పరిస్థితి కానరావడం లేదన్నారు. సంఘం అనకాపల్లి జిల్లా కార్యదర్శి కర్రి అప్పారావు మాట్లాడుతూ 24 వేల మంది రైతులు గోవాడ ఫ్యాక్టరీ పరిధిలో గతంలో చెరుకు సాగు చేసేవారని, నేడు ఆ సంఖ్య 5 వేల మందికి పడిపోయిందని తెలిపారు. చెరుకు రైతులే కదా అని చిన్న చూపు చూస్తే కూటమి ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పేందుకు అంతా సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డి.వెంకన్న మాట్లాడుతూ స్థానిక ప్రజాప్రతినిధులు కనీసం ఫ్యాక్టరీ వైపు కన్నెత్తి చూడకపోవడం దారుణమన్నారు.



మాట్లాడుతున్న సిడిపిఒ లక్ష్మీదేవి

'పోషణ్ భీ, పడాయి భీ'పై అంగన్వాడీలకు శిక్షణ

ప్రజాశక్తి-సీలేరు : పోషణ్ భీ, పడాయి భీ కార్యక్రమంపై అంగన్వాడీ కార్యకర్తలకు మూడు రోజుల పాటు జరుగు శిక్షణ తరగతులు జీకే వీధి మండల కేంద్రంలో శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ సిడిపిఒ లక్ష్మీదేవి మాట్లాడుతూ శిక్షణలో భాగంగా రెండో రోజు పోషణ, పౌష్టికాహారం, పిల్లలు బరువు గుర్తింపు తదితర అంశాలపై అవగాహన కల్పించినట్లు చెప్పారు. పిల్లల్లో బరువు తగ్గినట్లయితే వైద్యాధికారిని సంప్రదిస్తే తనిఖీలు చేసి పౌష్టికాహార పునరావస కేంద్రానికి రిఫర్ చేయడం జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సిబ్బంది అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

హుకుంపేట : స్థానిక ఐసిడిఎస్ కార్యాలయంలో అంగన్వాడి కార్యకర్తలకు రెండో రోజు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఐసిడిఎస్ సిడిపిఒ సిహెచ్ బాలామణి దేవి మాట్లాడుతూ, పిల్లలకు పౌష్టికాహారం ఏ విధంగా ఇవ్వాలో వివరించారు.

జివిఎంసి స్థాయీ సంఘంలో 101 అంశాలు ఆమోదం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : జివిఎంసి పరిధిలో పలు అభివృద్ధి పనులు చేపట్టేందుకు స్థాయీ సంఘం 101 అంశాలకు ఆమోదం తెలిపింది. స్థాయీ సంఘం ఛైర్‌పర్సన్ గొలగాని హరి వెంకట కుమారి శుక్రవారం జివిఎంసి ప్రధాన కార్యాలయంలోని స్థాయీ సంఘం సమావేశ మందిరంలో స్థాయీ సంఘం సభ్యులతో సమావేశం నిర్వహించారు. అజెండాలో 104 అంశాలను పొందుపరచగా స్థాయీ సంఘం సభ్యులు చర్చించిన పిదప ఒక అంశాన్ని వాయిదా వేశారు. రెండు అంశాలను తిరస్కరించారు. మిగిలిన 101 అంశాలు ఆమోదం పొందాయి. వాటిలో ఇంజినీరింగ్ విభాగం, ప్రజారోగ్య విభాగం, పలు అభివృద్ధి పనుల అంశాలకు సంబంధించినవి ఉన్నాయి.

సమావేశంలో కార్యదర్శి బివి.రమణ, వ్యయ పరిశీలకులు సి.వాసుదేవరెడ్డి, జోనల్ కమిషనర్లు ప్రేమ ప్రసన్నవాణి, శివప్రసాద్, మల్లయ్య నాయుడు, బి.రాము, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు చిరంజీవి, గంగాధర్‌రావు, సుధాకర్, అప్పారావు, సహాయ వైద్యాధికారులు డాక్టర్ ఎన్.కిషోర్, డాక్టర్ సునీల్ కుమార్, డాక్టర్ కిరణ్ కుమార్, డాక్టర్ అప్పలనాయుడు , డాక్టర్ కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

సంచార ఆర్ఆర్ఆర్ కేంద్రాలు ప్రారంభం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : జివిఎంసి ఆధ్వర్యంలో నగరంలోని గాజువాక, కెఆర్ఎం కాలనీ వంటి ప్రధాన ప్రాంతాలలో సంచార ఆర్ఆర్ఆర్ (రిడ్యూస్, రీయూజ్, రీసైకిల్) కేంద్రాలను ప్రారంభించామని స్క్రాప్ క్యూ సంస్థ ప్రతినిధి సుంకరి తులసీరాం తెలిపారు. ఆర్ఆర్ఆర్ కేంద్రాల సేవలు ఏప్రిల్ 1 నుంచి పూర్తి స్థాయిలో అందుబాటులోకి వస్తాయని వెల్లడించారు. దీంతో వ్యర్థాల (చెత్త) నిర్వహణ, పర్యావరణ పరిరక్షణ పెరుగుతుందని అన్నారు. విశాఖపట్నం వ్యాప్తంగా ఆరు ఆర్ఆర్ఆర్ కేంద్రాలు ఏర్పాటయ్యాయని తెలిపారు.

5న భద్రాచలానికి ప్రత్యేక బస్సులు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : శ్రీ రామ నవమి సందర్భంగా విశాఖపట్నం నుంచి భద్రాచలంనకు ఏప్రిల్ 5న ప్రత్యేకంగా బస్సులు నడుపుతున్నట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి బి.అప్పలనాయుడు తెలిపారు. ఆ రోజు ఉదయం 6 గంటలకు, అలాగే సాయంత్రం 5 గంటలకు ప్రత్యేక బస్సులు విశాఖలోని ద్వారకా బస్ స్టేషన్ నుండి వయా రాజమండ్రి మీదుగా నడుపబడతాయని పేర్కొన్నారు. ప్రయాణికులు, భక్తులు ముందస్తుగా రిజర్వేషన్ చేయుంచుకోవాలని కోరారు.